ధర 'మామూలు'గా లేదు!

- మార్కాపురం కూరగాయల మార్కెట్‌లో దుకాణాలన్నీ మూత
- కూటమి కట్టి కేవలం రెండు దుకాణాల్లోనే విక్రయాలు
- తిరునాళ్ల ఖర్చు పేరుతో సరికొత్త దందా
- మూడు రెట్లు అధిక ధరకు విక్రయించడంపై ప్రజల విస్మయం



కూరగాయల మార్కెట్‌లో మూసివేసిన షాపులు

మార్కాపురం: మార్కాపురం కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు కూటమి కట్టి అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించడంపై పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభకు చందాలు ఇవ్వాలంటూ మూడు రోజులపాటు అనధికారికంగా మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. మార్కెట్‌ను శాసించే వ్యాపారులు ఈనెల 20 నుంచి 22 వరకు దుకాణాలు మూసేయాలంటూ హుకుం జారీ చేశారు. మార్కెట్‌లో సుమారు 50 మంది వ్యాపారులు ఉండగా కేవలం రెండు దుకాణాల్లో మాత్రమే వారి ఇష్టమొచ్చిన ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారు. శనివారం రూ.40 ఉన్న కిలో మిర్చి ఆదివారం నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. కిలో టమోటా రూ.15 నుంచి రూ.30కు, బెండ కిలో రూ.30 నుంచి రూ.65, కిలో దొండ రూ.30 నుంచి రూ.62, దుంప రూ.30 నుంచి రూ.60కి విక్రయిస్తున్నారు. ఎవరైనా ఈ నిబంధన అతిక్రమించి కూరగాయలు అమ్మితే దూషణలు, దౌర్జన్యానికి దిగుతుండటం గమనార్హం. తిరునాళ్ల ఖర్చుల పేరుతో కూటమి కట్టిన వ్యాపారులు మూడు రెట్లు ధర పెంచి విక్రయించడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా



మార్కాపురం కూరగాయల మార్కెట్‌లో కొందరు వ్యాపారులు కూటమి కట్టి వ్యవహరిస్తున్న తీరు, అధిక ధరలకు కూరగాయలకు విక్రయించడంపై ఆదివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. నిత్యావసర వస్తువుల విక్రయ చట్టాన్ని ఉల్లంఘించిన హోల్‌సేల్ వ్యాపారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి. మూసివేసిన షాపులను వెంటనే తెరిపించాలని కోరుతున్నాం. హోల్‌సేల్ వ్యాపారుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి.

– సోమయ్య, సీపీఎం నాయకుడు

పేద విద్యార్థులకు వరం.. వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్



మాట్లాడుతున్న కారుమూరి నాగేశ్వరరావు, వేదికపై చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు

మార్కాపురం: వైఎస్సార్ తెచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పేద విద్యార్థులకు వరమని, కార్పొరేట్ చదువులు ఉచితంగా అందడంతో ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉద్యోగాలు చేస్తుండటం సంతోషకరంగా ఉందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఇందిరా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు, కరస్పాండెంట్ వెన్నా హనుమారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మళ్లీ విద్యార్థులందరూ సంతోషంగా చదువుకోవాలంటే జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వంతో సాగిస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాలని విద్యార్థులను కోరారు. మార్కాపురం వైయస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఏపీ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీర్జా షంషేర్ అలీబేగ్, తర్లుపాడు, మార్కాపురం, కొనకనమిట్ల జెడ్పీటీసీ సభ్యులు వెన్నా ఇందిర, నారు బాపన్‌రెడ్డి, ఏడుకొండలు, మున్సిపల్ వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆళ్ల ఆంజనేయరెడ్డి, మెట్టు వెంకటరెడ్డి, కేవీ రమణారెడ్డి, పీఎల్‌పీ యాదవ్, భవనం రామచంద్రారెడ్డి, వైవీరావు, గాయం శ్రీనివాసరెడ్డి, నల్లబోతుల కొండయ్య, మురారి వెంకటేశ్వర్లు, గౌస్ మొద్దీన్, శివకృష్ణారెడ్డి, డాక్టర్ కనక దుర్గ, గొలమారి శివారెడ్డి, బొందలపాడు సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, బాలవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో కారుమూరి నాగేశ్వరరావు, శ్యామల తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండుగ



మార్కాపురంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

మార్కాపురం: మార్కాపురం పట్టణం, రూరల్‌లో ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ ఎర్రం జాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శనివారం అర్ధరాత్రి దీపాల వెలుగుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సందర్భంగా చిన్నారుల పాటలు అందరినీ అలరించాయి. అఖిల, పీటర్ ఫెలో, శిరీష, చర్చిపెద్దలు, క్రైస్తవులు భారీ సంఖ్యలో పాల్గొని ఈస్టర్ పండుగ ఘనంగా జరుపుకున్నారు.

ఘనంగా పట్టాభిరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ



కలశాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

మార్కాపురం: మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో ఆదివారం పట్టాభిరామ స్వామి కల్యాణ, విగ్రహ, కలశ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా గ్రామంలో కలశాలను ఊరేగించారు. అనంతరం రాములవారి కల్యాణ మహోత్సవాన్ని వేదమంత్రాల నడుమ నిర్వహించారు. అర్చకుడు జె.నాగరాజు పూజలు చేశారు. నిర్వాహకులు బాలిరెడ్డి, ఎం కృష్ణ, వెంకటరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామోత్సవం సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

ఎన్‌రోల్‌మెంట్‌లో జెడ్పీ బాలుర హైస్కూల్‌కు ద్వితీయ స్థానం



హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి తదితరులు

మార్కాపురం టౌన్: ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో అత్యధికంగా 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను ఎన్‌రోల్ చేయడం, హాజరయ్యేలా చూడటంలో స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో నిలవడం అభినందనీయమని మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కపురం శ్రీనివాసరెడ్డి, గుంటక చెన్నారెడ్డి, ఆర్‌కేజీ నరసింహులు పేర్కొన్నారు. జిల్లాలో ద్వితీయ స్థానం సాధించిన సందర్భంగా జెడ్పీ హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పండిత పరిషత్ నాయకులు జీఎల్ రమేష్‌బాబు, శ్యామ్ శుభకర్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన చినారికట్ల విద్యార్థి

- ఆలిండియా 1566వ ర్యాంక్



వివేక్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లి భాగ్యం

కొనకనమిట్ల: జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో కొనకనమిట్ల మండలం చినారికట్ల గ్రామానికి చెందిన నల్లబోతుల వివేక్ ఆలిండియా 1566వ ర్యాంక్ సాధించాడు. చినారికట్ల గ్రామానికి చెందిన నల్లబోతుల సుబ్బారావు, భాగ్యం దంపతుల కుమారుడైన వివేక్ ఇంటర్మీడియెట్ ఒంగోలు శ్రీ ప్రతిభ కాలేజీలో చదివాడు. శనివారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వివేక్ ఆలిండియా 1566 ర్యాంక్ సాధించటంపై కాలేజి చైర్మన్‌తో పాటు అధ్యాపకులు, చినారికట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. తమ కుమారుడు విద్యలో రాణించటంపై వివేక్ తల్లిదండ్రులు సుబ్బారావు, భాగ్యంలు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తూ వివేక్‌కు స్వీట్లు తినిపించారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మార్కాపురం: భూదేవీ శ్రీదేవీ సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణమంతా కోలాహలంగా మారింది. ఇదే సమయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వీర బ్రహ్మంగారి నాటకం, చింతామణి, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాలను పలువురు తిలకించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఈ నటులు పాడే పద్యాలను పలువురు ఆసక్తిగా విన్నారు. ప్రధానంగా సత్యహరిశ్చంద్రుడు, బ్రహ్మంగారు, సిద్దయ్య, భవానీ పాత్రలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ పౌరాణిక నాటకాల్లో మార్కాపురం పట్టణానికి చెందిన పలువురు సీనియర్ నటులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం టౌన్: అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ డిపో మేనేజర్ నరసింహులు సూచించారు. ఆదివారం స్థానిక ఫైర్ స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో తరచూ జరిగే అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని ఆర్టీసి డిపో ఆవరణలో ఆదివారం ప్రయాణికులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్నిమాపకశాఖ అనుమతుల మేరకు భవనాల నిర్మాణాలు చేపట్టాలని అగ్నిమాపకశాఖ అధికారి హరిబాబు కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ, అగ్నిమాపకశాఖ సిబ్బంది బీమానాయక్, డి.పీరావలి, రియాజ్, లక్ష్మీనాయక్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సత్యమాంబదేవికి పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోట సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న వెంకటస్వామి

బేస్తవారిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఈస్టర్ పండగ సందర్భంగా దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు 50 మందికి దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు పోలూరు వెంకటస్వామి ఆదివారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెరాజీము సంఘ పెద్దలు జూలియస్ సీజర్, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు కంభంలో ముస్లింల శాంతి ర్యాలీ

కంభం: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం కంభం పట్టణంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ముస్లిం మత పెద్దలు తెలిపారు. సోమవారం ఉదయం పది గంటలకు జామియా మసీదు నుంచి ర్యాలీ ప్రారంభమై చౌకసెంటర్, ఆంధ్రాబ్యాంక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా కందులాపురం కూడలి వరకు సాగుతుందని, అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ర్యాలీలో ముస్లింలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

వైభవంగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ చెన్నకేశవస్వామి వారు



తిరునాళ్ల సందర్భంగా కళారూపాల ప్రదర్శన

మార్కాపురం: మార్కాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. మార్కాపురం పట్టణంతోపాటు వేములకోట, చింతగుంట్ల, తిప్పాయిపాలెం, గజ్జలకొండ, కొండేపల్లి, శివరాంపురం, రాయవరం, పెద్దారవీడు, తర్లుపాడు, దేవరాజుగట్టు, గొబ్బూరు తదితర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. రెండు రోజులుగా స్వామివారికి హనుమంత వాహనం, గరుడోత్సవం, గజవాహనం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు అలరిస్తున్నాయి. స్వామివారి ఉత్సవాలు తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రారంభమై ఉదయం 9 గంటల వరకూ కొనసాగుతున్నాయి. పట్టణమంతా సందడి వాతావరణం నెలకొంది. తిరునాళ్ల సందర్భంగా బంధుమిత్రులందరూ మార్కాపురానికి రావడంతో వీధులన్నీ కళకళలాడుతున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాలతో సందడిగా ఉంది. ఉదయం పూట జరుగుతున్న ఉత్సవాల్లో వేల సంఖ్యలో భక్తులు స్వామివారి వాహనాన్ని మోస్తూ జై చెన్నకేశవా... జైజై చెన్నకేశవా.. అంటూ ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదానాలు, అల్పాహారాలు, మంచినీటి సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్లు భక్తుల కోసం ఏర్పాటు చేశారు.



విద్యుత్ కాంతులతో స్వామివారి ఆలయం

రథోత్సవానికి ఏర్పాట్లు: భూదేవీ శ్రీదేవీ సమేతుడై స్వామివారు సోమవారం సాయంత్రం రథంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సుమారు 50 వేలకు మందికిపైగా భక్తులు పాల్గొనవచ్చని అంచనా. వివిధ స్వచ్ఛంద, ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో దర్శనం కోసం వచ్చే భక్తులకు పలు ప్రాంతాల్లో అన్నదానాలు చేయనున్నారు. మార్కాపురం డీఎస్పీ డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. డివిజన్‌లో 12 మంది ఎస్సైలు, ముగ్గురు సీఐలు, ఏపీఎస్‌పీ కానిస్టేబుల్స్, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు.